క్లుప్తంగా

కేవీపీఎస్ వార్షికోత్సవం

వేలేరు : కేవీపీఎస్ 26వ వార్షికోత్సవాన్ని మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల రవి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కులాంతర వివాహలకు రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు శ్రీనివాస్, సాంబరాజు, నరసయ్య పాల్గొన్నారు.

అకడమిక్ వీసీని నియమించాలి

కేయూ క్యాంపస్ : అకడమిక్ అనుభవం ఉన్న వారినే కాకతీయ యూనివర్సిటీ వీసీగా నియమించాలని కేయూ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి కోరారు. ఈమేరకు గురువారం కేయూ సెర్చ్ కమిటీకి ఈమెయిల్ ద్వారా లేఖ పంపారు. యూనివర్సిటీలోని హాస్టళ్లు, పరిపాలనపరమైన సమస్యలున్నాయన్నారు. అకడమిక్ పరిశోధనల అనుభవం కలిగిన వారినే వీసీగా నియమించాలని సెర్చ్ కమిటీ మెంబర్లకు పంపిన లేఖలో ఇస్తారి కోరారు.

6న చిత్రలేఖనం, మట్టిబొమ్మల తయారీ పోటీలు

హన్మకొండ చౌరస్తా : బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో చిత్రలేఖనం, మట్టి బొమ్మల తయారీపై పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా నిర్వహించే చిత్రలేఖన పోటీలతో పాటు ఈసారి డ్యూయల్ రోల్ పేరుతో రెండు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు 81436 43337 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఏఐసీడబ్ల్యూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్

ఖిలా వరంగల్: జాతీయ సమాఖ్య ఏఐసీడబ్ల్యూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా శివనగర్‌కు చెందిన మొగిలిచెర్ల సుదర్శన్ నియమితులయ్యారు. ఈమేరకు నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన తెలిపారు.

సునీతకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో హనుమకొండకు చెందిన గుడిపెల్లి సునీతకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇన్నోవేషన్స్ ఇన్ బ్యాంకింగ్ సెక్టార్ – ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ బ్యాంక్స్ అనే అంశంపై ప్రొఫెసర్ దీపశ్రీ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సునీత డాక్టరేట్ అందుకున్నారు.

శంభునిపేటలో గ్యాంగ్‌వర్క్

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని విశ్వనాథ కాలనీలో పారిశుద్ధ్య సిబ్బంది గురువారం గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. బతుకమ్మ సంబురాల్లో భాగంగా అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం పూలతో నిండిపోయింది. దాంతో పూలు, వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లలో నింపి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. కార్యక్రమంలో బల్దియా అధికారులు, సిబ్బంది, ఆలయ చైర్మన్ కర్నె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ బకాయిలు చెల్లించాలి

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేటలోని యూపీహెచ్‌సీ (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్)కి బకాయి ఉన్న నిధులను ప్రభుత్వం కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు యూపీహెచ్‌సీని సీపీఐ హనుమకొండ కమిటీ నాయకుడు వేల్పుల సారంగపాణి ఆధ్వర్యంలో పలువురు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 నెలలుగా ఆస్పత్రికి రావాల్సిన నిధులు రాకపోవడంతో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు అందడం లేదని వాపోయారు.

58వ డివిజన్ రాఘవేంద్ర కాలనీ ఫేజ్ -2లో కల్వర్ట్ నిర్మించండి

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో ఫేజ్ -2 రోడ్డు నంబర్ 2/ఏ నుంచి 2/ఎఫ్ వరకు కల్వర్టు, సీసీ రోడ్డు, ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలని కాలనీ వాసులు ఈ.కుమారస్వామి, ఏ.రవి, ఎండీ.సర్వర్, సుధాకర్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2018లో రోడ్డు నంబర్ 2/ఏ వద్ద సీసీ రోడ్డు వేసిన అధికారులు దానిపైన కల్వర్ట్ వేయలేదని తెలిపారు. కాలనీలో ఎక్కువశాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలకు చెందిన వారే ఉంటున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో కాలనీ మొత్తం జలమయం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన జేఏసీ నాయకులు

వరంగల్ అర్బన్: కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్‌ను గ్రేటర్ వరంగల్ జేఏసీ నూతన కార్యవర్గం సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.

అధికారులు.. సమయానికి రారు!


11 గంటలైనా విధులకు హాజరుకాని ఉపాధి హామీ సిబ్బంది


10.30 గంటలైనా హాజరు కాని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

- ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యం
- 11 గంటలైనా ఖాళీ కుర్చీలే దర్శనం
- పనుల కోసం వచ్చి ప్రజల పడిగాపులు

శాయంపేట : ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఉన్నతాధికారులు పలమార్లు ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే ఉద్యోగుల తీరు మారడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఉదయం 10.40 గంటల కావస్తున్నా విధులకు హాజరుకాకపోవడంతో వివిధ సమస్య పరిష్కారానికి కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదు దారులు అసహనం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో పలు విమర్శలకు దారితీస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువవడంతో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందించాలని పలువురు కోరుతున్నారు.

ఆలస్యంగా వస్తే సెలవురోజుగా పరిగణిస్తాం

హనుమకొండ నుంచి శాయంపేటకు బస్సు సౌకర్యంలేక ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాందారిపేట నుంచి శాయంపేటకు వచ్చేందుకు ఆలస్యం అవుతుంది. సిబ్బంది ఆలస్యంగా రాకుండా చర్యలు చేపడుతాం. ఇక నుంచి ఎవరైనా ఆలస్యంగా వస్తే సెలవు రోజుగా పరిగణిస్తాం. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.

- ఫణించంద్ర, ఎంపీడీఓ

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- ఏసీపీ కిశోర్‌కుమార్


మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్‌కుమార్

దామెర : పోలీసులపై తప్పుడు ప్రచారాలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ముస్త్యాలపల్లిలో నెలకొన్న భూ వివాదానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ముస్త్యాలపల్లిలో సర్వేనంబర్ 255/1లో గల 2.04 ఎకరాల అసైండ్‌ల్యాండ్‌ను చిలువేరు భిక్షపతి తండ్రి నర్సయ్యకు అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఇదే గ్రామానికి చెందిన బండారు ఐలయ్యకు 255/2లో 1.38 ఎకరాలకు గాను ఎస్సారెస్పీ కెనాల్‌లో 1.21 ఎకరాలు పోగా 17 గుంటలు మిగిలి ఉండాలని, అయితే 38 గుంటలు రికార్డులో నమోదు చేసి పలువురికి విక్రయించినట్లు తెలిపారు. అక్రమంగా రికార్డుల్లోకి నమోదు చేసుకున్న సుజాత.. భిక్షపతి భూమిలోకి వచ్చి తన భూమి ఉందంటూ ఘర్షణకు దిగినట్లు తెలిపారు. ఈ క్రమంలో కొన్నిరోజుల క్రితం సుజాత తన కూతురుతో కలిసి భిక్షపతికి చెందిన పైపులు ధ్వంసం చేసి మోటార్‌ను బావిలో వేసిందన్నారు. అంతేకాకుండా నాలుగు రోజుల క్రితం జేసీబీ సాయంతో భిక్షపతి భూమిలోకి వెళ్లి చదును చేసేందుకు ప్రయత్నించగా, భిక్షపతి అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. దీంతో అతనిపై దాడిచేసిందని, బాధితుడి ఫిర్యాదు మేరకు సుజాతపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ విషయమై రెవెన్యూ అధికారుల నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. పోలీసులపై తప్పుడు ప్రచారాలు, అభియోగాలు మోపుతూ ప్రజలను, మీడియాను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. భూ వివాదాల్లో తలదూర్చేది లేదని స్పష్టం చేశారు. ఏసీపీ వెంట శాయంపేట రూరల్ సీఐ రంజిత్‌రావు, దామెర ఎస్సై అశోక్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సబ్బండవర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత


సర్వే దరఖాస్తుతో మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, అధికారులు

పరకాల : రాష్ట్రంలోని సబ్బండవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ సర్వేను మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో గల సీఎస్ఐ కాలనీలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ సర్వేకు ప్రజలంతా సహకరించి, సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, కమిషనర్ నర్సింహ, కౌన్సిలర్స్ సారయ్య, జ్యోతి, లావణ్య, రజని, సుజాత, కోఆప్షన్ సభ్యుడు ముఫీనా ఫాతిమా హమీద్, షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చంద్రమౌళి, నాయకులు జెమిని, సంపత్, శ్యామ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైన మండలంలోని సర్వాపూర్ గ్రామంలో సర్వే కొనసాగుతుంది. ఇంటింటా సర్వేను ఆర్డీఓ నారాయణ గురువారం పరిశీలించారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలి



దామెర : పంటల్లో వ్యాపించే చీడపీడల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాకేష్ అన్నారు. పులుకుర్తి రైతువేదికలో కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం ద్వారా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పత్తి పంటలో సస్యరక్షణ యాజమాన్య పద్ధతి గురించి అవగాహన కల్పించి మాట్లాడారు. తక్కువ ఖర్చుతో సేద్యపు పద్ధతులు, యాంత్రిక పద్ధతులు, జీవన నియంత్రణ పద్ధతుల ద్వారా మందులు వినియోగించి అధిక దిగుబడి సాధించవచ్చారు. పైరుకు మేలు చేసే పురుగులను రక్షించుకుంటూ, నష్టపరిచే చీడపీడలను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని అన్నారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి అన్నపూరెడ్డి, భూమన్నగౌడ్, వెంకట్ రెడ్డి, ఏఈఓ రామకృష్ణ, రైతులు లక్ష్మణ్, వేణుగోపాల్, ఎడ్ల గోపాల్, రాంబాబు, రమేశ్, మహేందర్, రాజు, రవీందర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

దామెర : సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎస్ఆర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ లింగంపెల్లి నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ఎస్ఎస్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చలివాగు ప్రాజెక్టులో చేపపిల్లల విడుదల


చలివాగు ప్రాజెక్టులో చేపపిల్లను విడుదల చేస్తున్న ఎస్సై ప్రమోద్‌కుమార్, చైర్మన్ రాజమౌళి

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని చలివాగు ప్రాజెక్టులో మత్స్య సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రూ.12 లక్షల విలువచేసే ఆరు లక్షల చేపపిల్లలను సొసైటీ చైర్మన్ గండి రాజమౌళి, పాలకవర్గ సభ్యుల సమక్షంలో విడుదల చేశారు. ఎస్సై ప్రమోద్‌కుమార్ హాజరై చేపపిల్లను ప్రాజెక్టులోకి వదిలారు. చేపల పట్టేందుకు కాంట్రాక్టర్ వ్యవస్థను తొలగించాలని మత్స్యకారులు ఇటీవల ప్రకటనలు చేయగా స్పందించిన సొసైటీ చైర్మన్ రాజమౌళి పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులతో మాట్లాడారు. సొసైటీ ద్వారానే 30 లక్షల రూపాయల రుణాలు తీసుకొచ్చి చేపపిల్లలను ప్రాజెక్టులో వదలాలని తీర్మాణించారు. దీంతో గురువారం ఆరు లక్షల చేపపిల్లలను ప్రాజెక్టులో విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని పిల్లలను ప్రాజెక్టులో విడుదల చేస్తామని చైర్మన్ తెలిపారు. చేపలు పట్టేందుకు కాంట్రాక్టుకు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. సంఘ సభ్యులు కట్టిన రుసుము ప్రకారం 13 గ్రామాలకు చెందిన 1,276 మంది సంఘ సభ్యులకు చేపల ద్వారా వచ్చే ఆదాయాన్ని సమానంగా పంచుతామన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి నరేష్, డైరెక్టర్లు తిరుపతి, సురేష్, ఆనంద్, తిరుపతి, మాజీ డైరెక్టర్‌లు శ్రీధర్, సదయ్య పాల్గొన్నారు.

ఇంటి పంటల సాగుకు శ్రీకారం చుట్టాలి

- ఎస్ఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కమలాపూర్ : ఆహారం దివ్య ఔషధమని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో ఇంటి పంటల సాగుకు శ్రీకారం చుట్టాలని ఎస్ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. మండలంలోని గూడూరులో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కళాశాల డీన్ డాక్టర్ జి.భూపాల్‌రాజ్, కో ఆర్డినేటర్ రాథోడ్‌లాల్‌సింగ్ మార్గదర్శకత్వంలో గురువారం కిచెన్ గార్డెన్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం పేరుతో రంగంలోకి వచ్చిన అధిక దిగుబడి వంగడాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుపు నాశనులు, జన్యుమార్పిడి విత్తనాలు ఆహారాన్ని విషతుల్యంగా మార్చేసి భూమిని నాశనం చేస్తున్నాయన్నారు. పోషకాహార లభ్యతను పెంచడంలో సామూహిక ఇంటి పంటల సాగు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఏఈఓ ప్రశాంత్, వ్యవసాయ విద్యార్థులు హారిక, పూజిత, అభినయ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


మాట్లాడుతున్న దామోదర్

ఆత్మకూరు : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని స్వర్ణభారతి మహిళా సమాఖ్యలో గురువారం మహిళలకు లింగాధారిత హింస నివారణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల రక్షణ చట్టాలపై ప్రతీ ఒక్క మహిళ అవగాహన పెంచుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం లలితాదేవి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రజిత, ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్, సమాఖ్య కార్యదర్శి అరుణ, సీసీ శ్యాంసన్, రజని, ఫీల్డ్ ఆఫీసర్ రవీందర్ తదతరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బీజేపీ నాయకుల పరామర్శ



ఆత్మకూరు : మండలంలోని చౌళ్లపల్లిలో పిడుగుపాటుతో మృతిచెందిన ఇటుకాల నిర్మల, సోలంక రమ కుటుంబాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్ గురువారం పరామర్శించారు. ఇరువురి మృతదేహాల వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే బాధిత కుటుంబాలను తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ పరామర్శించారు.

కాంగ్రెస్ నాయకుల ఓదార్పు

వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన మండల అయిలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు సింగపురం ఇమ్మాన్యూయేల్‌రాజ్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్థికసాయం అందజేశారు.

బావిలోపడి వృద్ధుడి మృతి

దామెర : మతిస్థిమితంలేని వృద్ధుడు బావిలోపడి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని సింగరాజుపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల మురళి కొంతకాలంగా మానసికస్థితి సరిగాలేక బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన అతడు ఇంటికి రాకపోవడంతో బంధువులు అతడి ఆచూకీ కోసం గాలించారు. కాగా గురువారం ఇంటి సమీపంలోని బావిలో శవమై తేలాడు. మృతుని కుమారుడు హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గిరబోయిన రమణయ్య గుండె నొప్పితో బాధపడుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రమణయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పరకాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైద్యుల వెంకటరాజిరెడ్డి, నాయకులు కట్టయ్య, కృష్ణమూర్తి, వలిహైదర్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన దూదిపాల ఆదిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల కీర్తిసత్యపాల్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆదిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా నాయకులు మొగిలి, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రమణారెడ్డితో పాటు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ


కమలాపూర్ : గుండేడులో దుర్గామాతను దర్శించుకుంటున్న భక్తులు


దామెర : దామేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కమలాపూర్ : దుర్గామాత విగ్రహాన్ని మండపానికి తీసుకెళ్తున్న నిర్వాహకులు

దామెర : మండల వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు పోల్సాని శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల రాజుశర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా ఆలయానికి తీసుకొనివచ్చి ప్రతిష్టించారు. మాజీ పీపీలు పోల్సాని అనిల్‌రెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, కమిటీ సభ్యులు మేరుగు కుమారస్వామి, మాజీ జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, దుర్శెట్టి భిక్షపతి పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసిన గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

కమలాపూర్ : మండలంలోని గుండేడుతో పాటు పలు గ్రామాల్లో దుర్గామాత శరన్నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దుర్గామాత విగ్రహాలను నిర్వాహకులు, భక్తులు ఆనందోత్సవాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి మండపాల్లో ప్రతిష్టించారు. అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నవరాత్రుల అనంతరం విజయదశమి (దసరా) రోజున దుర్గామాత నిమజ్జనంతో నవరాత్రోత్సవాలు ముగియనున్నాయి.

శాయంపేట : మండలంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి డప్పుచప్పుళ్ల నడుమ అమ్మవారిని ప్రతిష్టించారు. శ్రీశివమార్కండేయ, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో విగ్రహ దాత సీనియర్ న్యాయవాది లెక్కల జలంధర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మొదటి రోజు అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు మార్త రాజ్‌కుమార్ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలి

నడికూడ : మండలంలోని గొల్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు కారణంగా 20 రోజుల నుంచి నడికూడ వచ్చే బస్ సర్వీసును రద్దు చేశారు. కాగా వారంరోజుల క్రితం సీసీరోడ్డు పనులు పూర్తి అయ్యాయి. కానీ గొల్లపల్లి మలపు వద్ద పైప్ లైన్ మరమ్మతుల కారణంగా కొంతభాగం సీసీరోడ్డు పనులను కాంట్రాక్టర్ నిలుపుదల చేయగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు, పాలకులు స్పందించి సీసీరోడ్డు పనులు పూర్తిచేసి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు.

బీఆర్ఎస్ నాయకుడితో ప్రాణహాని

దామెర : మండల కేంద్రానికి చెందిన ఓ బీఆర్ఎస్ నాయకుడితో తనకు ప్రాణహాని ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన ఓ నాయకుడు తనను బెదిరిస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రవికుమార్


నియామకపత్రం అందుకుంటున్న రవికుమార్

దామెర : ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మాదారపు రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న పూర్వవిద్యార్థులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆసోద లింగయ్య, అధ్యక్షుడిగా మాదారపు రవికుమార్, ఉపాధ్యక్షుడిగా దామెర రాజేందర్, కార్యదర్శిగా ఉప్పుల సతీష్, కోశాధికారిగా రాయబారపు నరేందర్, మహిళా కార్యదర్శిగా జంగం రాణి, సలహదారులుగా పుల్లూరు మల్లికార్జున్, వర్కుటి సత్యంను ఎన్నుకున్నారు. కరుణాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రవణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత



వరంగల్ చౌరస్తా: వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత అని కాసం ఫౌండేషన్ సభ్యుడు కాసం దీక్షిత్ అన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కాసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న అనాథ వద్ధులకు బుధవారం సాయంత్రం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిపెంచిన తల్లిదండ్రులను వద్ధాశ్రమాల్లో వదిలివేయకుండా, వారిని ఆప్యాయంగా చూసుకుంటూ ప్రేమానురాగాలు పంచాలన్నారు. చలికాలం వస్తున్నందున వృద్ధులకు దుప్పట్లు పంచుతూ వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసున్నారు.